తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక వార్త





## ఎర్రచందనం దొంగలు

# హల్‌చల్

## చెక్‌పోస్టులు ధ్వంసం-టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు



శ్రీకాళహస్తి/శ్రీకాళహస్తి రూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో ఎర్రచందనం దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. శుక్రవారం వేకువ జామున జరిగిన సంఘటనకు సంబంధించి బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. శ్రీకాళహస్తిరూరల్ సిఐ, ఏర్పేడు సిఐ, రేణిగుంట డివైయస్‌పి సంఘటనా స్థలానికి వెళ్ళినా సమాచారం బయటపెట్టలేదు. అయితే ఈ సంఘటనలో టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ ప్రభాకర్‌రావు (40) గాయపడి తిరుపతిలోని ఆసుపత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం వేకువ జము 3గంటలకు ఏర్పేడు వైపు నుంచి వెంకటగిరివైపు ఓ కారు పరుగులు తీస్తుండగా టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి సమాచారం అందింది. ఆ కారులో ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రాజుల పాళెం వద్ద టోల్ గేట్ వద్ద ఆపారు. అయితే కారు నడుపుతున్న వ్యక్తి కారును ఆపకుండా టోల్ గేట్లను గుద్దేసి పరుగులు తీసాడు. ఇక్కడ సిబ్బంది టాస్క్ ఫోర్సు పోలీసులు చింతపాళెం వద్ద ఉన్న అటవీశాఖ చెక్‌పోస్టు సిబ్బందికి సమాచారం అందించారు. అటవీశాఖ సంబందించిన ఇద్దరు సిబ్బంది టాస్క్‌ఫోర్సుకు చెందిన ఇద్దరు ఉద్యోగులు ఉన్నారు. వారు ఆపటానికి ప్రయత్నించారు. అయితే ఎక్కడ దొరికిపోతామేమో అనే భయంతో కారునడుపుతున్న వ్యక్తి వారి మీద కూడా కారును దూసుకుపోయేటట్లు చేసారు. దాంతో ఉద్యోగులు భయభ్రాంతులయ్యారు. ఇక్కడ అటవీశాఖకు సంబధించిన కర్రను గుద్దారు. ఆ కర్ర అక్కడే ఉన్న టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్ ప్రభాకర్‌కు బలంగా తగిలింది. దాంతో ఆతను గాయపడ్డారు. ఆతన్ని వెంటనే తిరుపతి ఆసుపత్రికి తరలించారు. అయితే కారు మాత్రం ఆగకుండా పలాయనం చిత్తగించింది.

### పోలీసుల పరిశీలన:

ఈ సంఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు రేణిగుంట డివైయస్‌పి భవ్యశ్రీ, ఏర్పేడు ఎస్ఐ జిలాని, శ్రీకాళహస్తిరూరల్, అజయ్‌కుమార్, ఏర్పేడు సిఐలు సంఘటనా స్థలానికిచేరుకున్నారు. రెండు చెక్ పోస్టుల వద్ద పరిస్థితిని గుర్తించారు. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే చెక్‌పోస్టు వద్ద ఉన్న సిసి కెమెరాలు పని చేయలేదా? కారు నంబరు నమోదు కాలేదా? పోలీసులు ఎందుకు ఈ విషయాన్ని బయటకు పెట్టలేదు? బహుశా ఈ కారు, ఎర్రచందనం ఎవరైనా పలుకుబడి కల్గిన వారికి సంబంధించిందా? అనే చర్చ చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి నుంచి విచ్చల విడిగా ఎర్రచందనం రవాణా జరుగుతుంది. అయితే ఎవరికి వారు తమకేమి తెలియదన్నట్లు వ్యవహారిస్తున్నారు.

## ముగిసిన గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు

తిరుమల, ఫిబ్రవరి 23ప్రభాతవార్త :



తిరుపతిలోని శ్రీగోవిందరాజ స్వామి ఆలయంలో వేడుకగా వారంరోజులపాటు జరిగిన వార్షిక తెప్పోత్సవాలు శుక్రవారం రాత్రి ముగిశాయి. చివరిరోజు రాత్రి శ్రీదేవిభూదేవి సమేత గోవింద రాజస్వామిని ఆలయంనుండి మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. ఇక్కడ ఆలయ అర్చకులు కర్పూరహారతులిచ్చి స్వామి వారిని తెప్పపై వేంచేపుచేశారు. భక్తుల గోవిందనామస్మరణలతో తెప్ప ముందుకు కదిలింది. ఏడుచుట్లు తెప్పపై గోవిందరాజులు ఉయదేవేరులతో కలసి విహరించారు. అనంతరం ఆలయానికి ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామిసన్నిధికి స్వామివారు వేంచేసి ఆస్థానం నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయంగారు, చిన్నజీయంగారు, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్, భక్తులు పాల్గొన్నారు.

# అవినీతి పాలనకు అడ్డుకట్ట

## - నారా భువనేశ్వరి



మృతి చెందిన మోహన్‌నాయుడు భార్యకు రూ.3 లక్షల చెక్కును అందజేస్తున్న నారా భువనేశ్వరీ.

చిత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ అవినీతి పాలనకు అడ్డుకట్ట వేయడానికి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు శ్రమించాలని జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరీ పిలుపునిచ్చారు. సిఎం వైఎస్ జగన్ ప్రభుత్వం జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును జైలులో నిర్బంధించిన సమయంలో మనస్థాపంకు గురై మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించడానికి నారా భువనేశ్వరీ శుక్రవారం చిత్తూరు రూరల్ మండలం మట్టుకూరు గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరీ మృతి చెందిన పార్టీ కార్యకర్త మోహన్‌నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఆయన కుటుంబసభ్యులను ఆమె పరామర్శించి ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున రూ.3 లక్షల ఆర్థిక సహాయంను అందజేశారు. మృతి చెందిన మోహన్‌నాయుడు పిల్లలకు ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఉచిత విద్య అందించడానికి చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంను పాలిస్తున్న ప్రభుత్వం అరాచకాలు, అక్రమాలకు పాల్పడుతుందని ఆరోపించారు. అరాచక, అవినీతి పాలన అంతం అయ్యే వరకు నాయకులు, కార్యకర్తలు పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం ఆ ప్రాంత రైతులు 33 వేల ఎకరాల భూమిని నిస్వార్థంతో ఇస్తే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమరావతి ఆశలపై నీళ్ళు చల్లారని ధ్వజమెత్తారు. రాజధాని అమరావతి సాధన కోసం అక్కడి రైతులు పదిహేను వందల రోజులుగా పోరాటాలు చేస్తున్నా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేసి మరోసారి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఇప్పటికే ప్రజల కోసం సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించారన్నారు. ఈ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ది కల్గుతుందన్నారు.

## భువనేశ్వరిని మరచిన నగరి దేశం శ్రేణులు

తిరుపతి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి అనే అంశంపై చేస్తున్న పర్యటనలో భాగంగా గంగాధరనెల్లూరు నుంచి పుత్తూరు మీదుగా సత్యవేడు నియోజకవర్గానికి వెళ్లారు. అయితే ఆమెకు పుత్తూరులో టిడిపి శ్రేణులెవరూ స్వాగతం పలకలేదు. మొదటిసారి ఆమె నగరి నియోజకవర్గానికి వచ్చినందున భారీ స్థాయిలో స్వాగతం పలకాల్సి వుంది. పుత్తూరు మునిసిపాలిటీ పరిధిలో వున్న చినరాజుకుప్పం నుంచి చిత్తూరు - పుత్తూరు రోడ్డు, తిరుపతి - చెన్నై రోడ్డు మీదుగా ఆమె నారాయణవనం చేరుకున్నారు. చినరాజుకుప్పం నుంచి ఆర్డీఎం థియేటర్ వరకూ పుత్తూరు పట్టణంలో పర్యటించినా టిడిపి శ్రేణులు ఆమె పర్యటనను పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ అభిమానులు దీనిపై విస్మయం చెందారు.

## సైకో పాలన అంతం కోసం కష్టపడండి : నారా భువనేశ్వరి



తుంబూరులో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న నారా భువనేశ్వరీ

నారాయణవనం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న సైకో పాలన అంతం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని తెలుగుదేశం అధినేత నారా చంద్ర బాబు నాయుడు సతీమణి భువనేశ్వరి కోరారు. శుక్రవారం తిరుపతి జిల్లా నారాయణవనం మండలపరిధిలోని తుంబూరులో చంద్రబాబు అరెస్టు సమయంలో మృతి చెందిన కుమ్మరి మునివేలు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సైకో జగన్ పాలనలో ప్రతి ఒక్కరు కష్టాలు పడుతున్నారన్నారు. మరో 50రోజులపాటు టిడిపి, జనసేన కార్యకర్తలు సమిష్టిగా పని చేసి జగన్ పాలనను అంతం చేయడానికి కృషి చేయాలన్నారు. అనంతరం మునివేలు కుటుంబాన్ని ఓదార్చి 3లక్షల రూపాయల చెక్కును అందజేశారు. సత్యవేడు టిడిపి ఇంచార్జీ హెలెన్ హేమలత, మండల టిడిపి అధ్యక్షులు పి గిరిబాబు, నాయకులు టి షణ్ముగం, కెఎస్‌రవి, సుబ్రమణ్యం, బిట్ర బాలసుబ్రమణ్యం, ప్రేమ్‌కుమార్, పురుషోత్తం, రాజశేఖర్‌యాదవ్, కె.వాసుదేవన్, పొన్నుస్వామియాదవ్, మునివేలు, గోపి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యవేడులో భువనేశ్వరీకి ఘన స్వాగతం

నారాయణవనం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరీ శుక్రవారం నారాయణవనం మండలంలోని తుంబూరు జరిగిన నిజం గెలవాలని కార్యక్రమంలో పాల్గొన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సమాచారం తెలుకొని జీర్ణించుకోలేక మృతి చెందిన తుంబూరుకు చెందిన కుమ్మరి మునివేలు మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఓదార్చి ఆదుకోవడం కోసం నారా భువనేశ్వరీ శుక్రవారం వచ్చారు. పుత్తూరు మీదుగా తుంబూరుకు వెళ్లే మార్గంలోని 11వార్డు బత్తలవారికండ్రిగ వద్ద సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్, నారాయణవనం జడ్పీటీసీ కోనేటి సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు 800మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి బాణా సంచాకాల్చి నారా భువనేశ్వరీని దుశ్శాలువ సత్కరించి, పట్టుచీరను అందించారు. అనంతరం రేణిగుంట విమాశ్రయంలో నారాభువనేశ్వరీకి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమం లో నాయకులు ఎస్ఎం సురేష్, మహేష్, తిరునీలకంఠన్, ఇలంగోవన్ రెడ్డి, ఎ దినకరన్, రాజశేఖర్ యాదవ్, సోనా సురేష్, వి మురుగేశం, కోన మాజీ ఛైర్మన్ బత్తల భాస్కర్‌యాదవ్, సిపిఐ మహేష్, మాజీ సర్పంచ్ శంకరయ్య, గాండ్ల గోవిందశెట్టి, నాగలాపురం, పిచ్చాటూరు, సత్యవేడు, నారాయణవనంనుంచినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సిఎం బహిరంగ సభ ఏర్పాట్లపై నేతల పరిశీలన

శాంతిపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ భరత్, జడ్పీచైర్మన్ శ్రీనివాసులు

ఈనెల 26వతేది సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి శాంతిపురం మండలం మఠం వద్ద జరిగే బహిరంగసభలో పాల్గొననున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో సిఎం బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్సీ భరత్, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, రెస్కో ఛైర్మన్ సెంథిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మాజీ డిసిఎంసి ఛైర్మన్ శ్యామరాజు పరిశీలించారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సభావేదిక, ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న, సర్పంచ్ ఎవి జయరాం, మురళి పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంకు నాక్ బి ప్లస్ గ్రేడ్

తిరుపతి క్రీడా, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయంకు నాక్ బి ప్లస్ గ్రేడు ఇచ్చారు. ఈ నెల 13వ తేది నుండి 15వ తేది వరకు నాక్ పీర్ రివ్యూ టీం విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలను తనిఖీ చేసారు. పశువైద్య విశ్వ విద్యాలయంలో నాక్ గుర్తింపు పొందిన మొట్టమొదట విశ్వవిద్యాలయంలో నాక్ గుర్తింపు పొందిన మొట్టమొదటి విశ్వ విద్యాలయంగా ఇది నిలుస్తుంది. ఇప్పటికి ఈ విశ్వవిద్యాలయానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్, వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు కూడా ఈ విశ్వ విద్యాలయానికి రావడం జరిగింది. యుజిసి 12బి 2 ఎఫ్‌లో కూడా ఇది చేర్చడం జరిగిందన్నారు. న్యాక్ గుర్తింపు విశ్వవిద్యాలయానికి రావడానికి కృషి చేసిన డా. జి. జగపతి రామయ్య అసోసియేట్ డీన్‌ను, ఇతర సిబ్బంది, అధ్యాపకులను రిజిస్ట్రార్ డా. ఎ. రవి, డీన్ డా. కె. వీరబ్రహ్మయ్య, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. సర్జన్ రావు అభినందించారు.

## విద్యుత్ బిల్లులు తగ్గింపుపై మరమగ్గ కార్మికుల ఆనందోత్సాహం



నగరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

మరమగ్గాలకు విద్యుత్‌బిల్లులు తగ్గిస్తున్నట్టు ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.31 మరమగ్గ నిర్వాహకుల్లో ఎనలేని ఆనందాన్ని నింపింది. నగరి సభలో జగనన్న ఇచ్చిన హామీ జీవో రూపంలో వచ్చి నెరవేరడంతో వారి ఆనందోత్సాహం మిన్నంటింది. శుక్రవారం బస్టాండ్ ప్రాంగణంలో టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచుకుని పండుగ చేసుకున్నారు. ఈ సందర్భంగా మరమగ్గ నేత సామాజిక వర్గానికి చెందిన మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం పోతూ పోతూ తమ మరమగ్గాలకు సంబంధిత కేటగిరిని మార్చేసి వెళ్లిందన్నారు. ఒక్క సారిగా పెరిగిన విద్యుత్ బిల్లులు ఆందోళనకు గురి చేయగా అందరూ మంత్రి రోజాకు, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సెల్వమణికి సమస్యను చెప్పుకోవడం జరిగిందన్నారు. అయితే సామాజిక వర్గానికి చెందిన ఆడపడుచుగా ఆమె ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపి నగరిలో జగనన్న విద్యా దీవెన లాంఛనంగా ప్రారంభించేందుకు నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లారన్నారు. మాటపై నిలబడే జగనన్న రూపాయి ఉన్న ఎలక్ట్రిసిటీ డ్యూటీని 6 పైసలుగా మార్చి నేడు జీవోను విడుదల చేసి చెప్పారంటే చేస్తారంతే అని నిరూపించుకున్నారన్నారు.

## పేదలను ఆదుకుంది వైసీపీ ప్రభుత్వమే - మంత్రి రోజా



టీసీ అగ్రహారంలో ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

వడమాలపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

పేదలకు అండగా ఉంటూ వివిధ పథకాలతో వారిని ఆదుకున్నది జగనన్న ప్రభుత్వమేనని మంత్రి రోజా పేర్కొన్నారు. శుక్రవారం వడమాలపేట మండలం టీసీ అగ్రహారంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల్లో భాగంగా పేదలందరికి రెండవ విడత ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. రెండవ విడతగా 560 పట్టాలను లబ్ధిదారులకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నజగనన్నకు అందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుజాతమ్మ, మండల తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, అన్నిశాఖల మండల స్థాయి అధికారులు, మండలంలోని మండల ప్రాదేశిక సభ్యులు, కో-ఆపరేటివ్ అధ్యక్షుడు కరుణాకర్‌చౌదరి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు శేఖర్, గ్రామ సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ జన్నత్ హుస్సేన్ కన్నుమూత

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరిగా పనిచేసిన విశ్రాంత ఐఎఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ శుక్రవారం తెలవారు జామున తన స్వగృహంలో కన్నుమూశారు. 1977 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన జన్నత్ హుస్సేన్ ఆంధ్ర రాష్ట్రంలో వివిధ శాఖల్లో పనిచేసి మెరుగైన పనితీరును కనబరిచారు. 1985-87 సంవత్సరాల్లో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసి జిల్లా ప్రజల మన్ననలు పొందారు. ఆయన గుర్తుగా నెల్లూరులో జన్నత్ హుస్సేన్ నగర్‌ను ఏర్పాటు చేసి ఇప్పటికీ ఆయన పేరును స్మరించుకుంటున్నారు. మాజీ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల హయాంలో వారి వద్ద ప్రిన్సిపల్ సెక్రటరీగా జన్నత్ హుస్సేన్ పనిచేశారు. రాష్ట్రంలో పేద ప్రజలకు అప్పటి ముఖ్యమంత్రులు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో జన్నత్ హుస్సేన్ పాత్ర ఉంది. ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్ధనగర్‌లో జన్మించిన జన్నత్ హుస్సేన్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఐఎఎస్ అధికారిగా పదవీ విరమణ చేసిన అనంతరం ఆయన గత కొన్నేళ్లుగా అల్జీమర్ వ్యాధితో బాధపడుతున్నారు. సూళ్లూరుపేటలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటూ కాలం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడవడంతో ఆయన పార్థివదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. జన్నత్ హుస్సేన్ పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

## గ్రూప్ 2 పరీక్షలు విజయవంతంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీ షా



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

జిల్లాలో ఈ నెల 25వ తేది నిర్వహించే గ్రూప్ 2 పరీక్షలు ఎలాంటి చిన్న పొరపాట్లు జరగకుండా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీ షా పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశం హాల్‌లో డిఆర్ఓ పెంచలకిషోర్, గ్రూప్ 2 పరీక్షల విభాగం అడిషనల్ సెక్రటరీ వెంకటలక్ష్మిలతో కలిసి ఈ నెల 25న తిరుపతి జిల్లాలో నిర్వహించే గ్రూప్ 2 పరీక్షల నిర్వహణపై రూట్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లు చీఫ్ సూపరింటెండెంట్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 25న ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించే గ్రూప్ 2 పరీక్షలు తిరుపతి జిల్లాలోని తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు, కోట, గూడూరు మండల కేంద్రాలలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 61 సెంటర్స్‌లో 27894 మంది గ్రూప్ 2 పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఇందుకోసం 31 మందిని జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగాను, 61 మంది తహశీల్దార్‌లు, ఎంపిడిఓలను లైజన్ ఆఫీసర్లుగాను, 61 చీఫ్ సూపరింటెండెంట్లుగా ఆయా కళాశాలకు సంబంధించిన ప్రిన్సిపాల్స్‌ను నియమించడం జరిగిందని తెలిపారు. ఉదయం 9.30 గంటలకల్లా అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలను చేరుకోవాలని, హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. పరీక్ష సమయం పూర్తి అయిన తరువాతనే బయటకు పంపించాలన్నారు. సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించబడదని, ఒకవేళ ఎవరైనా సెల్ ఫోన్‌లు తీసుకొస్తే పరీక్ష కేంద్రం నందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో భద్రపరిచే విధంగా ఏర్పాటు చేయాలని సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం జరగకుండా చూడాలని, పరీక్ష కేంద్రాల వద్ద త్రాగునీరు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్‌తో పాటు ఒక ఏఎన్ఎం ఏర్పాటు చేయాలని సంబంధితా అధికారులను ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల అభ్యర్థులకు అదనంగా సమయం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో రూట్ ఆఫీసర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## రూ.3 లక్షల విలువైన గంజాయి స్వాధీనం - ముగ్గురు అరెస్టు

చిత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:



చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాధరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ షేక్షావలీ, సిబ్బంది 3 లక్షల విలువైన 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులు అరెస్టు చేశారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి విలేకరులకు వివరాలు వెల్లడిస్తూ చిత్తూరు నగర శివారు ప్రాంతాల్లో గంజాయి అక్రమ అమ్మకాలపై వచ్చిన సమాచారం మేరకు పోలీసులు నగరంలోని నీమ్స్ గార్డెన్ పరిసరాల్లో దాడులు నిర్వహించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి విచారిస్తే వీరు వైజాగ్ నుండి గంజాయిని అక్రమంగా కొనుగోలు చేసి చిత్తూరు నగర శివారు ప్రాంతాల్లో అమ్ముతున్నట్లు తేలిందన్నారు. వీరు చాలా కాలంగా గుట్టు చప్పుడు కాకుండా గంజాయి వ్యాపారం చేస్తున్నారన్నారు. ముగ్గురు నిందితులను పట్టుకొనే సమయంలో ఒకొక్కరి నుండి రెండు కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. ఈ మేరకు ఈ కేసులో పట్టుబడిన జిడినెల్లూరు మండలంకు చెందిన ఎస్.చంద్రు(23), చిత్తూరు కొంగారెడ్డిపల్లి షర్మన్ స్కూల్ డౌన్, సిఎంటి రోడ్డుకు చెందిన ఎస్.దిలీప్(23), చిత్తూరు తోటపాళ్యంకు చెందిన జి.రామకృష్ణ(27)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

## టీచర్ అసభ్యప్రవర్తనపై విచారణ

### విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

పాలసముద్రం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:



పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న విచారణ అధికారులు

మండలంలోని కృష్ణజివమ్మాపురం పంచాయతీ ఎస్ఆర్ఆర్ కండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ బోధించే ఉపాధ్యాయుడు తరగతి విద్యార్థినిలపై వెకిలి చేష్టలు చేస్తుండటంతో ఆయనకు తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. మండలంలో ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా వున్నాయి. కృష్ణజిమ్మాపురం పంచాయతీ ఎస్ఆర్ఆర్ కండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇంగ్లీషు ఉపాధ్యాయుడు ఆ పాఠశాల విద్యార్థినిలతో అనుచితంగా ప్రవర్తించేవాడు. ఈ మేరకు కొంతమంది విద్యార్థినిలు ఈ విషయంను తమ తల్లిదండ్రులకు చెప్పడంతో వారు డిఇఓ దేవరాజులుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై డిఇఓ స్పందించి పాఠశాలలో జరుగుతున్న వాస్తవాలు తెలుసుకోవడానికి జిడినెల్లూరు మండల విద్యాశాఖ అధికారి గుణశేఖర్, పాలసముద్రం ఎంఇఓ-2 గిరిజలను విచారించాలని ఆదేశించారు. డిఇఓ ఆదేశాల మేరకు శుక్రవారం పాఠశాలకు వెళ్ళిన ఎంఇఓలు విద్యార్థినిలను విచారణ చేశారు. ఇంగ్లీషు ఉపాధ్యాయుడి చేష్టలపై విచారించడానికి అధికారులు వచ్చారని తెలియడంతో విద్యార్థినిల తల్లిదండ్రులు అక్కడికి చేరుకొన్నారు. విచారణ అధికారులకు పాఠశాల విద్యార్థినిలు వాస్తవాలు చెప్పడంతో తల్లిదండ్రులు ఉద్రేకం చెంది ఇంగ్లీషు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. పాఠశాలలో విచారించిన నివేదికను డిఇఓకు అందిస్తామని విచారణ అధికారులైన ఎంఇఓలు గుణశేఖర్, గిరిజలు పేర్కొన్నారు.

## స్కూల్ వ్యాను కింద పడి మూడేళ్ళ చిన్నారి దుర్మరణం



ఐరాల, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: స్కూల్ వ్యాను కింద పడి మూడేళ్ళ చిన్నారి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని ఐరాల-దామల్‌చెరువు రోడ్డు ఎగువ గూబలవారిపల్లె వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు గూబలవారిపల్లెకు చెందిన శ్రీహరి, లక్ష్మీదేవిల కుమార్తె మోక్షశ్రీ పాలక మండలం దామల చెరువులోని విజయ స్కూల్‌లో చదువుతోంది. ఈనేపథ్యంలో శుక్రవారం మోక్షశ్రీ అవ్వ స్కూల్ వ్యాను ఎక్కించేందుకు ఎగువ గూబలవారిపల్లె రోడ్డు వద్దకు వచ్చింది. ఈమెతో పాటు వచ్చిన మోక్షశ్రీ చెల్లి సాత్వికి అనే చిన్నారి స్కూల్ వ్యాను కిందకు పోవడంతో డ్రైవర్ వ్యాను ముందుకు నడిపించాడు. దీనితో సాత్వికి వ్యాను చక్రాల కింద పడి అక్కడే మృతి చెందింది. సంఘటలన జరిగిన వెంటనే వ్యాను అక్కడి నుండి పరారయ్యాడు. అయితే ఈ సంఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఐరాల ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న శివశంకరన్



కాణిపాకం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: పలమనేరు నియోజకవర్గ సీనియర్ నాయకులు నల్లగుట్టపల్లెకు చెందిన శివశంకరన్ శుక్రవారం కాణిపాకంలో కాంగ్రెస్‌పారీ తీర్థం పుచ్చుకున్నారు. ఈయన కాణిపాకంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈయనకు పోటుగారి భాస్కర్ కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా శివశంకరన్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఒక్కటే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలదని అన్నారు. తీను రానున్న ఎన్నికల్లో పలమనేరు నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి సుముఖంగా వున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీసీసీ మాజీ మాజీ కార్యదర్శి ఎ.పరదేశి, వి.కోట మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి రమణప్ప, నాయకులు నాగరాజు, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు సిఎం కావాలని మసీదులో ప్రార్థనలు

శాంతిపురం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగా ఉండాలని అలాగే వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి కావాలని కోరుతూ రాళ్లబూదుగూరు మసీదులో శుక్ర వారం తెదేపా నేతలు, మైనార్టీ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్సీ, సమన్వ యకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లింలకు ప్రత్యేక స్థానం కల్పించింది తెదేపానేనన్నారు. ముస్లింలు తెదేపా వైపే ఉంటార న్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శి డా॥ సురేష్‌బాబు, మైనార్టీ నేతలు జాకీర్, సర్దార్, అన్సర్, కలీముల్లా, వాజిద్, కుమార్, మణి, జయరాజ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా వన్నియ కులక్షత్రియ నేతలచే కరపత్రాలు పంపిణీ

కుప్పంరూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



మండలంలోని మంకలదొడ్డిపంచాయతీలో తెదేపా వన్నియకులక్షత్రియ యువత అధ్వర్యంలో బూత్ నెం 121లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భం గా నియోజకవర్గ వన్నియకులక్షత్రియ యువత అధ్యక్షుడు సతీష్, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి రామూర్తిలు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబునాయుడుకు లక్ష ఓట్ల మెజార్టీ సాధనకు తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు నేతలు శ్రీనివాసులు, సురేష్, గణేష్‌కుమార్, వినోద్‌కుమార్, బాబు, రాజశేఖర్, వెంకటేష్, ఈశ్వర్, సంపంగిం, రమేష్, మునివెంకటప్ప, ఆనంద్, ఎల్లప్ప పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీ పురోగతికై ప్రిన్సిపాళ్లతో సమావేశం

**కుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** ద్రవిడ విశ్వవిద్యాలయం పురోగతి సాధించేందుకు శుక్రవారం వర్సిటీ ఉపకులపతి ఆచార్య మధుజ్యోతి అధ్యక్షతన వర్సిటీలో సమావేశం జరిగింది. ఈ సమావేశంకు నియోజకవర్గంలోని ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్ల హాజరయ్యారు. వర్సిటీలో అడ్మిషన్లు, విద్య పట్ల విద్యార్థుల్లో అవగాహన, డ్రాపొట్లు, వర్సిటీలో అందించే కోర్సులు తదితరాలపై చర్చించారు. ఈసందర్భంగా విసి ఆచార్య మధుజ్యోతి మాట్లాడుతూ వర్సిటీలో త్వరలో కొత్త కోర్సులు ప్రవేశపెడతా మన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి, అకడమిక్ డీన్ ఆచార్య శ్రీనివాస్‌కుమార్, ప్రిన్సిపాళ్ల జగదీష్‌బాబు, చంద్రప్ప, సరిత, మురళీకృష్ణ, వెన్నెల పాల్గొన్నారు.

## పోలింగు కేంద్రాల పరిశీలన

కల్లూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



రాబోవు 2024 జనరల్ మరియు లోక్‌సభ ఎన్నికల నిమిత్తం ఏర్పాటు చేయబోయే పోలింగ్ కేంద్రాలను పోలింగ్ బూతులను శుక్రవారం సర్కిల్ ఇన్స్పక్టర్ రవి ప్రకాష్‌రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా బూతులలో మౌలిక వసతులలో భాగంగా విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు మరియు సిబ్బందికి బాత్‌రూంలు వంటివి ఉన్నాయా అని పరిశీలించారు. అంగవైకల్యం కలిగినటువంటి వారు ఓటు వేయడానికి వీలుగార్యాంపుల ఏర్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణి, ఉపాధ్యాయు లు వెంకటసిద్దులు, రాజేంద్ర, వేణుగోపాల్, వెంకటరమణరెడ్డి, ప్రకాష్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొ న్నారు.

## మామిడితోట దగ్ధం : రూ. 30వేలు ఆస్థినష్టం

చౌడేపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



మామిడితోట దగ్ధమై రూ. 30వేల వరకు ఆస్థి నష్టం వాటిళ్ళిన సంఘటన శుక్రవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. పుంగనూరు అగ్నిమాపక కేంద్ర అధికారి సుబ్బరాజు కథనం మేరకు...మండలంలోని పెద్దయల్లకుంట్ల పంచాయతీ చెడుగుట్లపల్లికి సమీపం లోని కడియాల మహేష్‌బాబు, తవడా హరిబా బు లకు చెందిన మామిడితోటకు నిప్పంటుకొంది. పుంగనూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది సుబ్రమణ్యం, లోకేష్‌రెడ్డి, వినోద్‌కుమార్‌లు తరలివచ్చి మంటలను పూర్తిగా అదుపు చేసారు. దాదాపు రూ. 30వేల వరకు ఆస్థినష్టం జరిగినట్లు రైతులు తెలిపారు.

## సేవాలాల్ ట్రస్టు నూతన కార్యవర్గం

పుంగనూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త : గిరిజనుల ఉన్నతే ధ్యేయంగా జీవితాన్ని త్యాగం చేసిన సంత్‌సేవాలాల్ త్యాగాన్ని గిరిజనులు తమ జీవితాంతం గుర్తుంచుకుంటామని సేవాలాల్ ట్రస్టు నాయకులు అన్నారు. శుక్రవారం మండలం లోని సుగాలిమిట్టలో సమావేశమయ్యారు. ఈసం దర్భంగా ఏడుతాండాల నుంచి ప్రతినిధులతో కార్య వ ర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ఈశ్వర్‌నాయ క్, కార్యదర్శిగా రెడ్డినాయక్, కోశాధికారిగా గోపాల నాయక్, ఉపాధ్యక్షులుగా బాలాజీనాయక్, శంకర్‌నాయక్, శ్రీరాములునాయక్, సహ కార్యదర్శులుగా నాగరాజనాయక్, శ్రీరాములనాయక్, రాజునాయక్‌తో పాటూ మరో ఏడు మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకు న్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాంతాల అభ్యున్నతికి పాటుపడేందుకు కృషిచేస్తామన్నారు.

## గణనాధుని సన్నిధిలో పూతలపట్టు ఎమ్మెల్యే

కాణిపాకం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:



పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్. బాబు శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శిం చుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ రమేష్, స్థానిక వైకాపా నాయకులు ఎల్.గోపీనాధన్, కాణిపాకం మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో డబ్బులు తరలించడానికే సీఎం హెలికాప్టర్‌లు కొనుగోలు

### -టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరిప్రసాద్

**తవణంపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** రానున్న ఎన్నికల్లో డబ్బులు తరలించడానికే సీఎం జగన్ ప్రజా ధనంతో రెండు హెలికాప్టర్‌లు లీజుకు తీసుకున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ పి.సప్తగిరిప్రసాద్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రం తవణంపల్లె టీడీపీ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద ఒక హెలికాప్టర్ అందుబాటులో వున్నప్పటికి తనకు భద్రత లేదని, తీవ్రవాదులు, ఉగ్రవాదుల నుండి ముప్పు పొంచి వుందన్న సాకుతో నెలకు 3,82 కోట్లు వెచ్చించి రెండు హెలికాప్టర్‌లను లీజుకు తీసుకున్నట్లు తెలిపారు. ఒక పక్క రాష్ట్రం అప్పుల ఊబిలోకూరుకుపోయి ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితులోల వుంటే సీఎం జగన్ తన విలాసాల కోసం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం విడ్డూరంగా వుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మధుకుమార్ యాదవ్, బీసీ సెల్ అధ్యఓడు వినాయక, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, నాయకులు జయపాల్, షబ్బీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పేదలకు వరం జగనన్న ఆరోగ్యసురక్ష

చౌడేపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరంలాం టిదని జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం దుర్గసుముద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. జబ్బు చేస్తే మెరుగైన వైద్యం కోసం ఆర్థికభారం భరించలేక కనుమరుగవుతున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్షతో ఆదుకొంటున్నారన్నారు. ఇటీవల ఆరోగ్యశ్రీలో సైతం మతింపును రూ. 25లక్షలకు పెంచిన విషయాన్ని వివరించారు. రాబోయే ఎన్నికల్లో పనిచేసే వైకాపా ప్రభుత్వానకి మద్దతు ఇవ్వాలన్నారు. అనంతరం ఆరోగ్య సురక్ష పనితీరును గురించి వివరించారు. అవ్వాతాతలకు కళ్ళజోళ్ళను పంపిణీ చేసారు. మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో ఛేర్మన్ రవిచంద్రారెడ్డి, ఎంపిటీసీ తొండా శ్రీరాములు, వైద్యాధికారి పూజ, సచివాలయ పరిధిలోని ప్రజలు పాల్గొన్నారు.

## వైష్ణవీదేవీ ఆలయంలో విశేష పూజలు



చౌడేపల్లి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్లలో గల వైష్ణవీదేవీ, నాగభైరవీ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. చౌడేపల్లి పట్టణంలోని ఆర్యవైశ్యల ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. ఉదయాన్నే వేదపండితులు, అర్చకులచే దేవతామూర్తులకు విశేషాభిషేకాలు, అలంకరణలు గావించారు. ఉభయదారుల ఆధ్వర్యంలో అమ్మవారి పవిత్ర తీర్థ వినియోగం జరిగింది.

## గంగమ్మకు వెండి దీపాలు విరాళం

బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు దాతలు వెండి దీపాలను విరాళంగా అందించారు. శుక్రవారం అమ్మ వారి సన్నిధానంలో ఆలయ ఛేర్మన్ నాగరా జరెడ్డి, మాజీ ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణల ఆధ్వర్యం లో దాతలు అనంతపురం హౌసింగ్‌బోర్డుకాలనీ లలి తమ్మరవికుమార్‌లురూ. లక్షవిలువచేయువెండి దీపా లందించారు. దాతలకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి సత్కరించారు. ధర్మకర్తల మండలి సభ్యు లు రాజేష్, భారతిసురేష్, మాజీ సభ్యుదుపూర్ణి మారాయల్‌మోహన్, ఆలయఅర్చక, అధికార సిబ్బందిపాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకుల అరెస్టు అక్రమం

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటూగారి భాస్కర్

**వెదురుకుప్పం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ నాయకుల అరెస్టు అక్రమమని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటూగారి భాస్కర్ ఖండించారు. మండల కేంద్రంలో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఛలో సెక్రటేరియట్ కార్యక్రమం తలపెట్టడం, ప్రశ్నించాలనుకోవడం అన్యాయమా అని ప్రశ్నించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చేపట్టిన కార్యక్రమానికి ప్రభుత్వం, పోలీసులు అడుగడుగునా అడ్డుకుంటూ తమ నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తున్న తీరు ఏమాత్రం సహేతుకంగా లేదన్నారు. సెక్రటేరియట్ కార్యక్రమానికి నేతృత్వం వహిస్తున్న ఏపీ సీసీ చీఫ్ వైఎస్ షర్మిలమ్మను సిడబ్ల్యూ, సిడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు గిడుగు రుద్రరాజు, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్వలిని, రాష్ట్ర నలుమూలల నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులను అడ్డుకుంటూ హౌస్ అరెస్టు చేస్తూ, నోటీసులు జారీ చేస్తూన్నారని ఆరోపించారు.

## సాగునీటి సెల్ కన్వీనర్‌గా ఆవుల మురళి

పాలసముద్రం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: జిల్లా బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షుడు జాగర్లముడి చంద్రశేఖర్‌నాయుడు జిల్లా సాగునీటి సెల్ కన్వీనర్‌గా ఆవుల మరళిని నియమించారు. ఈ సందర్భంగా ఆవుల మురళి మాట్లాడుతూ తాను రైతులకు అందుబాటులో వుంచి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. తనను జిల్లా సాగునీటి సెల్ కన్వీనర్‌గా నియమించిన కిసాన్ మోర్చా అధ్యక్షుడు జాగర్లముడి చంద్రశేఖర్‌నాయుడు, ఇతర బిజెపి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## బాబు షూరిటీ భవిష్యత్‌కి గ్యారెంటీ ఇంటింటికి ప్రచార కార్యక్రమం



గూడూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త చిల్లకూరు మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి సూచనల మేరకు ఏరూరు పంచాయితీ నందు స్థానిక నాయకులు పూడిపర్తి ప్రవీణ్ రెడ్డి, దయా నంద రెడ్డి, ఉడతా శ్రీనివాసులు, రాజయ్యలు ఏర్పాటు చేసారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పంచాయితీ నందు సుమారుగా 8 కోట్ల 41 లక్షల 23 వేల రూపాయిలు అభివృద్ధి చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదని తెలిపారు. గ్రామంలో సుమారుగా 2 కోట్ల 48 లక్షల రూపాయిలతో సిసి రోడ్లు వేసామన్నారు. ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం వచ్చి 4 సంవత్సరాలు పైగా అయినప్పటికి, ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమీలేదన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, నియోజకవర్గం రైతు అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, గుండాల లీలావతి, మాజీ ఎంపిటిసి అన్నం మునిశేఖర్ గౌడ్, మూగ శంకరయ్య, మేఘనూరు వెంకటకృష్ణయ్య, బిసి సెల్ మండల అధ్యక్షులు మేకల కుమార్, వేదనపర్తి కృష్ణ రెడ్డి, కోటేశ్వర రాజు, వెంకయ్య, అశోక్, నవీన్ చంద్ర దాసరి శైలజ, నెలటూరు సుప్రజ, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎండు పూలతో ఉపాధి : డాక్టర్ బిజి రాజులు

వెంకటగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: ఉద్యాన వనసాగులో ఎండుపూలతో అలంకరణ చేసి జీవనోపాధి పొందవచ్చని కేవికే శాస్త్రవేత్త డాక్టర్ బిజి రాజులు అన్నారు. శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం లో ఎండుపూలతో ఉపాధిపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండుపూలు నిరుపయోగంగా పడవేయకుండా వాటితో కొత్త తరహాలో అలంకరణ చేయవచ్చని తెలిపారు. రైతులు సాగులో రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులపై మక్కువ చూపాలని వివరించారు. భూసార పరీక్షలు నిర్వహించి తగుమోతాదులో ఎరువులు వాడా లని, అధికంగా రసాయన ఎరువులు వేస్తే భూములు నిస్సారమవుతాయన్నారు.

## నిమ్మ జ్యూస్ ఎంతో ఆరోగ్యకరం

వెంకటగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: వెంకటగిరి, రాపూరు, మండల కేంద్రాలల్లో కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో దత్తత గ్రామం అయిన సిసి కండ్రిగలో శుక్రవారం నిమ్మ విలువ ఆధారిత ఉత్పత్తులపై రైతు మహిళలను శిక్షణ కార్యక్రమాలను పెరియవరం కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్ర విభాగం శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీఆధ్వర్యంలోనిర్వహించినట్టు కెవికేఆధిపతిడాక్టర్‌బిజి రాజులు తెలిపారు. గృహ విజ్ఞానశాస్త్ర విభాగం శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ మాట్లాడుతూ నిమ్మ వల్ల చిన్నారులకు, గర్భిణి, బాలింతలకువీటి వల్లఎన్నోప్రయోజనాలున్నట్లు వివరించారు.

## వచ్చే ఎన్నికలల్లో వైకాపా ఖాళీ తథ్యం

### మాజీ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: వచ్చే సార్వత్రిక ఎన్నికలల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయ మని, వైకాపా ఖాళీ కావడం కూడా తథ్యమని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురు గుండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ప్రభాతవార్తతో అయన మాట్లాడుతూ ఇప్పటికే వైసిపి అంటే ప్రజలకు నాయకులకు విరక్తి రావడంతో నాయకులు వైసిపి వదిలి టిడిపిలో చేరుతున్నారన్నారు. నెల్లూరు జిల్లా మొత్తం వైసిపి ఖాళీ అవుతుందని జోస్యం చెప్పారు. నియోజకవర్గంలో టిడిపి ప్రచారజోరు ఊపందుకుందని తెలిపారు.

## మహిళల రక్షణకు పూనుకోవాలి - సిఐ



వెంకటగిరి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త: మహిళల రక్షణ బాధ్యతపై సచివాలయ మహిళ పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని వెంకటగిరి సిఐ సంఘమేశ్వరరావు అన్నారు. శుక్రవారం మహిళ పోలీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలీసు చట్టాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో జరిగే అసాంఘిక కార్యక్రమాలపై మహిళ పోలీస్ వెంటనే స్పందించి పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదులు చేయాలని సూచించారు.

## ఎన్‌బికెఆర్‌లో సాంకేతిక సదస్సు

కోట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త




విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ఐఎస్‌టిలో శుక్రవారం ట్రిపుల్ ఇ విభాగం ఆధ్వ ర్యంలో ఇనిస్పిరాన్-2024 సాంకేతిక సదస్సును కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సదస్సుకు రాష్ట్రంలోని 12కళాశాలల నుంచి85 మంది విద్యార్థులు పాల్గొ న్నారు. అనంతరం ట్రిపుల్ ఇ హెచ్ఓడిసురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ప్రావీణ్యత సంపాదించి ఎన్నో ఎలక్ట్రికల్ కోర్ కంపెనీల లో ఉద్యోగఅవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో కన్వీనర్‌డాక్టర్ ఐ.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నల్లపరెడ్డి సేవలు చిరస్మరణీయం

కోట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



దివంగత మాజీమంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి సేవలు చిరస్మరణీయమని కోట మండల బిజెపి అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు అన్నారు. శుక్ర వారం నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి 30వ వర్ధంతి సందర్భంగా కోటలోని ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులుఅంబరీష్, శరత్‌చంద్రారెడ్డి, పరశురామ్ పాల్గొన్నారు.

## ప్రతిభ గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

కోట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త ఈ విద్యా సంవత్సరం నుంచి 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో మొదటి స్థానం లో నిలిచే విద్యార్థినీ విద్యార్థులకు రోటరీక్లబ్ ద్వారా ప్రోత్సాహక నగదు పురస్కారాలను అందజేస్తామని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్ తెలిపారు. శుక్రవారం కోటలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అందించే సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరుస్తామని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. కోట పట్టణంలోని జడ్పీ బాలికల పాఠశాలలో 70 వేల రూపాయల విలువైన స్కూలు డెస్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ జలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కోట రోడ్లు బాగుచేయండి

కోట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త కోట క్రాస్‌రోడ్డు నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ఆర్అండ్‌బి రహదారులు అధ్వానంగా ఉన్నాయని, తక్షణమే ఆర్అండ్‌బి అధికారులు యుద్ధప్రాతిపదికపై మరమ్మతులు చేయాలని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం ఆయన కోటలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల లక్షలాది రూపాయలతోఈరోడ్లుతాత్కాలికంగామరమ్మతులుచేసినా ఉపయోగం లేదన్నారు.

## నా బిడ్డకు అండగా నిలవండి

నేదురుమల్లి రాజ్యలక్ష్మి



బాలాయపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త తన బిడ్డ రాంకుమార్ రెడ్డికి అందరూ అండగా నిలవాలని మాజీ మంత్రి నేదురు మల్లి రాజ్యలక్ష్మిపార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. మండలంలోని నిడిగల్లు, యాచారంగ్రామంలోనిపలువురునాయకులు, కార్యకర్తలను ఆమె కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా రాంకుమార్ రెడ్డి పోటీ చేస్తున్నారని ఆయనను గెలిపించాలని కోరారు. తమ కుటుంబంఎప్పుడు ప్రజలకు అండగా ఉంటుందని చెప్పారు. మాజీ సర్పంచ్ మస్తాన్ రెడ్డి, నాయకులు పోల్ రెడ్డి, సర్పంచ్ గాయత్రి సీనియర్ నాయకులను ఆమె ఆప్యాయంగా పలకరించారు. మీరు ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన అభివృద్ధి పనులు నేటికి చిరస్థాయిగా ఉన్నట్లు గ్రామస్తులు ఆమెకు తెలిపారు.

## భూసారాన్ని బట్టి ఎరువులు వాడాలి

ఏడిఏ నాగార్జున సాగర్

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



భూసారాన్ని బట్టి ఎరువులు వాడాలని ఏడిఏ నాగార్జున సాగర్ తెలిపారు. ఆత్మ పథకం ద్వారా కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల చేత మట్టి నమూనాల సేకరించి పరీక్షల కుపంపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు భూసార పరీక్షలు గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు రామాంజనేయులు, పుష్పాంజలి, పరమేశ్వర్, ఏవో సుజాత, ప్రిన్సిపాల్ ప్రేమ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిడబ్ల్యూ స్కీమును పరిశీలించిన సిఈవో

వాకాడు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



మండల కేంద్రంలో ఉన్న సమగ్ర రక్షిత మంచినీటి పథకమును శుక్రవారం నెల్లూరు జిల్లా సిఈవో కన్న మనాయుడు పరిశీలించారు. ఆ పరిసర ప్రాంతాల్లో ఉన్న వాటర్ ట్యాంకును, మంచినీటి పైపులను, విద్యుత్ బోర్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధించిన అధికారులతో మాట్లాడుతూ సిపిడబ్ల్యూ స్కీము వద్ద ఆ పరిసర ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంకర్లోను ఆర్‌డబ్ల్యూ అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు త్రాగునీరు అందించాలన్నారు. సిపి డబ్ల్యూ స్కీమ్ వద్ద మైంటైన్సు ఎప్పటికప్పుడు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డబ్ల్యూఎస్ డిఈ నందకుమార్, ఎంపిడివో గోపినాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ సురేష్ చౌదరి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పేకాటరాయుళ్ళు అరెస్టు



వాకాడు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త వాకాడు మండలం సిద్ధిగుంటపాలెంలో రొయ్యలు గుంటల వద్ద శుక్రవారం నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా సెబ్ సిఐ శ్రీనివాసులు రెడ్డి రెడ్ హండ్రెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సెబ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో తెలియడంతో సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 7000 రూపాయిలు నగదు, 4 సెల్ ఫోన్లు, హోండా డ్రీమ్ బైకు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.

## 10 మద్యం అక్రమ బాటిళ్ల పట్టివేత

వాకాడు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త కోట మండలం, ఊనుగుంటపాలెం గ్రామంలో శుక్రవారం మట్టిగుంట వెంకటసుబ్బయ్య వద్ద 10 మద్యం బాటిలను స్వాధీన పరుచుకున్నారు. ఇరువురు వ్యక్తుల మీద కేసు నమోదు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ రవి, బాలసుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, కృష్ణ తదితరులు ఉన్నారు.

## కళాబృందాలచే ఎయిడ్స్ నివారణపై ప్రచారం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త నవజీవన్ స్వచ్ఛంధ సంస్థ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం సూళూరుపేటలో ఎయిడ్స్ నివారణ నియంత్రణ అనే అంశంపై కళాబృందాలచే ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాబృందాలు ఎయిడ్స్ వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి పాటల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ కె.బాలాజీ, మంజుల, నందిని, రేవతి, ఉమా, కవితకళాబృందాలతరపున రెడ్డప్ప, హరనాథ్, నారాయణ, గుర్రప్పలు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో కల్తీ కొబ్బరినూనె పట్టివేత

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త సూళ్లూరుపేట పట్టణంలోని బాపూజీవీధిలో ఉన్న ఒక దుకాణంలో బ్రాండెడ్ కొబ్బరినూనె పేరుతో నకిలీ కొబ్బరినూనె విక్రయిస్తున్నారన్న సమాచారం ఆ దుకాణంపై జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 246 కల్తీ కొబ్బరినూనె డబ్బాలను స్వాధీనం చేసుకొని షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్‌మెంట్ ఎస్ఐ వెంకటరవి, సిబ్బంది పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్‌చే పేదలకు దుప్పట్లు పంపిణీ



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త సూళ్లూరుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. రోటరీ క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.దశరధరెడ్డి, ఎం.వినయ్‌సాగర్, రోటేరియన్లు తస్నీరు శేషగిరిరావు, అలవల సుధాకర్‌రావు, శ్రీరాములు యాదవ్, కుమారస్వామి, సుంకర ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

